క్లుప్తంగా

ట్రాన్స్ జెండర్ల కమ్యూనిటీ నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్స్ కమ్యూనిటీ

ఏలూరు (టూటౌన్): అనకాపల్లిలో ఈనెల 19న దీపు అనే హిజ్రాను హత్య చేసిన దుర్గాప్రసాద్‌ను ఉరి తీయాలని ఏలూరు ట్రాన్స్ జెండర్ల కమ్యూనిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏలూరు వసంత మహల్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు గురువారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దీపుని అతి కిరాతకంగా చంపిన బన్నీ, అలియాస్ దుర్గాప్రసాద్‌ను ఉరితీయాలన్నారు. సాధారణ మహిళలకు ఉన్నట్లే, ట్రాన్స్ జెండర్స్ భద్రత కొరకు ప్రత్యేకమైన చట్టాలు చేయాలని కోరారు. మహిళలపై దాడులు పెరిగిపోయాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌జెండర్స్ పాల్గొన్నారు.

అంజలికి న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): బొలినేని ఆస్పత్రిలో ఫార్మసిస్ట్ అంజలికి న్యాయం చేయాలని ఐద్వా ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలరాణి గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అంజలి ఆసుపత్రి సూపర్‌వైజర్ దీపక్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటనపై తక్షణ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అంజలికి న్యాయం చేయాలని, దీపక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంజలి స్వస్థలం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం అన్నారు. రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు దాడులు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వాడపల్లికి బస్సు సర్వీసు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఏలూరు డిపో నుంచి కోనసీమ తిరుపతిగా ప్రఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రానికి ప్రతి శనివారం బస్సులు నడుపుతున్నామని, ఇందులో భాగంగా కైకలూరు నుంచి వాడపల్లి వెళ్లే ప్రయాణికులకు ప్రత్యేక బస్సు సర్వీసు అందుబాటులోకి తీసుకొచ్చామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు సర్వీసు ప్రతి శనివారం తెల్లవారుజాము నాలుగు గంటలకు ఏలూరులో బయలుదేరి ఐదు గంటలకు కైకలూరు, అక్కడ నుంచి ఆకివీడు, కాపవరం, గణపవరం, పిప్పర, తాడేపల్లిగూడెం మీదుగా వాడపల్లి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ సర్వీసు తిరిగి ఉదయం 11.30 గంటలకు వాడపల్లి నుంచి బయలుదేరి అదే మార్గంలో కైకలూరు మీదుగా ఏలూరు చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆటోల్లో స్టీరియో సౌండ్‌లతో సమస్యలు

ప్రయాణికులు ఆవేదన

- ప్రమాద హేతువులుగా ఎల్‌ఈడీ లైట్ల వినియోగం
- నియంత్రణకు రవాణా అధికారుల ప్రత్యేక దృష్టి



ఎల్‌ఈడీ లైట్లను డ్రైవర్ చే తొలగింపజేస్తున్న రవాణా అధికారి



వాహనాల నుంచి తొలగించిన ఎల్‌ఈడీ లైట్లు, సౌండ్ సిస్టమ్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరం నుంచి చుట్టు పక్కల పెదపాడు, పెదవేగి, దెందులూరు వంటి ప్రాంతాలతో పాటు కొల్లేరు లంక గ్రామాల్లో ప్రజలకు ఆటోల సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఏలూరు పాత బస్టాండు నుంచి వట్లూరు వరకు ప్రధాన రహదారిగా ఉండగా మధ్యలో వసంతమహల్ సెంటర్, జూట్‌మిల్లు సెంటర్, ఫైర్ స్టేషన్, జిల్లా పరిషత్, కొత్తబస్టాండు, సీఆర్ఆర్ కళాశాల, శాంతి నగర్, సత్రంపాడు తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు నిత్యం వేల సంఖ్యలో తమ పనుల నిమిత్తం తిరుగుతునే ఉంటారు. వారికి నిమిషానికి ఒక ఆటో అన్నట్లుగా అందుబాటులోకి వచ్చాయి.

అధిక శబ్దాలతో సమస్యలు.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని డ్రైవర్లు

ప్రయాణికులను ఆకర్షించేందుకు ఆటోలకు ప్రత్యేక హంగులు అమర్చుతున్నారు. సౌకర్యవంతమైన సీట్లు, వానలు పడ్డా ప్రయాణికులు తడవకుండా పరదాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. కొందరు ఆటోల్లో డీటీఎస్ సౌండ్ సిస్టంలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి నుంచి వచ్చే పెద్ద పెద్ద ధ్వనులను కొందరు ప్రయాణికులు ఆస్వాదిస్తుండగా, మరి కొందరు భరించలేకపోతున్నారు. సమస్యను ఆటో డ్రైవర్లకు చెప్పినా పట్టించుకోవడం లేదు. డీటీఎస్ సౌండ్‌తో పాటలు పెట్టి తిరుగుతున్న ఆటోల కారణంగా రోడ్డుపై వెళ్లే ఇతర వాహన చోదకులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. డీటీఎస్ సౌండ్ వల్ల వెనకనుంచి వచ్చే వాహనాల శబ్దం తెలియక కొన్ని సార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి.

ఎల్‌ఈడీ లైట్లతో కళ్లపైకి కాంతి

సౌండ్ సిస్టంతోనే కాక ఆటోలకు అమర్చే ఎల్‌ఈడీ లైట్ల వల్లా అవాంతరాలు ఎదురౌతున్నాయి. కంపెనీ తయారీ సమయంలో ఇచ్చిన లైట్లు కాక హంగుల కోసం ఆటోల హెడ్‌లైట్లకు ఎల్‌ఈడీ బల్బులను వినియోగిస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహన చోదకులకు నేరుగా కళ్లలో ఆ లైట్ల కాంతి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరైతే ఎల్‌ఈడీ లైట్లే కాకుండా డిస్కో లైట్లు కూడా ఆటోల చుట్టూ పెట్టడం వల్ల కూడా ఇతర వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్‌ఈడీ, డిస్కో లైట్ల కారణంగా ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురైన వారిలో కొందరు ఆటోల యజమానులతో వాగ్వాదాలకు దిగుతున్నారు.

అధికారుల ప్రత్యేక దృష్టి

ప్రయాణికులకు ఇబ్బందులు సృష్టిస్తోన్న ఆటోల యజమానులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం ఆదేశాల మేరకు మోటారు వాహనాల తనిఖీ అధికారులు గత కొన్ని రోజులుగా ఏలూరు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఆటోలకు అదనంగా ఏర్పాటు చేసిన హంగులను తొలగిస్తున్నారు. ఇప్పటికే సుమారు 160 ఆటోల నుంచి ఇటువంటి సౌండ్ సిస్టంలు, ఎల్‌ఈడీ హెడ్‌లైట్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు.

పునరావృతమైతే జరిమానాలు విధిస్తాం



ఆటోల సౌండ్ సిస్టమ్స్, ఎల్‌ఈడీ లైట్ల వల్ల ఇబ్బంది పడుతున్న వారి నుంచి అనేక ఫిర్యాదులు అందాయి. దీనిపై ఏలూరు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికి సుమారు 160 ఆటోల నుంచి లైట్లు, సౌండ్ సిస్టమ్స్ తొలగించారు. ఇది ప్రాథమిక తప్పిదంగా గుర్తించి, తొలగింపుతో సరిపెట్టాం. ఇది పునరావృతమైతే జరిమానాలు విధిస్తాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తేలా ప్రవర్తించినా తగిన చర్యలు తీసుకుంటాం.

– షేక్ కరీమ్, ఉప రవాణా కమిషనర్, ఏలూరు జిల్లా

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి



ప్రజా చైతన్యయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

దెందులూరు: కొల్లేరును 5 నుంచి 3వ కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ పేర్కొన్నారు. కొల్లేరు ప్రజల సమస్యలపై సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొల్లేరు గ్రామాల్లో గురువారం ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడు, పత్తి కోళ్లలంక, గుడివాకలంక, కోటేశ్వరదుర్గాపురం తదితరు గ్రామాల్లో నాయకులు పర్యటించారు. కొల్లేరు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల్లో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారన్నారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు పరిధిలో 77,138 ఎకరాల చెరువుల ధ్వంసం పేరుతో 86 వేల ఎకరాలకుపైగా చెరువులను ధ్వంసం చేశారని చెప్పారు. 7500 ఎకరాల సొసైటీ చెరువులు, 13 వేల ఎకరాల్లో జిరాయితీ చెరువులను ధ్వంసం చేశారని వివరించారు. దీంతో కొల్లేరు ప్రజల పరిస్థితి గట్టునపడ్డ చేపల్లా మిగిలిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రజలకు జీవనోపాధి కల్పించాలని, 146 సొసైటీలను పునరుద్ధరించాలని, 13 వేల ఎకరాలు జిరాయితీ భూమి హక్కుదారులకు అప్పగించాలని కోరారు. సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబ్యునల్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేయాలన్నారు. కొల్లేరులో ఉన్న వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కొల్లేరు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, ప్రజలకు తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కట్టా భాస్కరరావు, కె.లెనిన్ వివిధ గ్రామాల కొల్లేరు ప్రజలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికడదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గిరిబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేటి సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం పెద్ద సమస్యగా మారిందని ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిబాబు మాట్లాడుతూ మాదక ద్రవ్య వినియోగ సమస్యపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ప్రభుత్వ ఆదేశానుసారం ఈగల్ క్లబ్‌ను స్థాపించామన్నారు. ముఖ్యఅతిథి ఈగల్ సెల్ జిల్లా ఇన్‌చార్జి బి.ఉదయ భాస్కర్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే గల్ క్లబ్ లక్ష్యమన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై టోల్ ఫ్రీ నెంబర్ 1972కి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, ఈగల్ క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ వి.వెంకట్రావు, ఎస్ పరమేశ, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారుల జీవనం దుర్భరం



మాధవరావును సత్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఆధునికీకరణలో భాగంగా చేతి వృత్తిదారుల జీవనం దుర్భరంగా మారిందని కార్పెంటర్స్ అసోసియేషన్ నాయకులు కొత్తల శివ ఆవేదన వ్యక్తం చేశారు. కార్పెంటర్స్ డే సందర్భంగా స్థానిక బాలాజీ థియేటర్ వద్ద ఉన్న సంఘ భవనంలో సీనియర్ కార్పెంటర్ రేపాక మాధవరావును ఘనంగా సన్మానించారు. శివ మాట్లాడుతూ ప్రపంచ ఆధునికీకరణలో భాగంగా కార్పెంటరీ వృత్తి పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. కాటకోటి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ వడ్రంగి వారికి ఆటోనగర్‌లో వర్క్ షాప్‌లు కేటాయించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు లక్కోజు గోపి మాట్లాడుతూ వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చేనేత వృత్తి వారికి ఇచ్చే పింఛన్ వడ్రంగి పనివారికి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వడ్రంగి పని చేసే బొద్దూరు కనక బాబు, అద్దంకి బ్రహ్మం, దంతినాడ నాగేశ్వరావు, రాంబాబు, లక్ష్మీ గృహ శోభ సందీప్, కాటకోటి సూరి ప్రకాష్, వీరిని ఆచారి, ధనాలకోట అప్పలరాజు, నాగమల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కేశవరంలో ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకుంటున్న జక్కంశెట్టి

గణపవరం : ఉపాధికూలీలను జీపీఎస్ పేరుతో ఫొటోలు తీయడానికి ఐదారు కిలోమీటర్ల దూరం నడిపించడం భావ్యంకాదని వారు పనిచేస్తున్న చోటే ఫోటోలు తీయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన గణపవరం మండలం కేశవరంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో నిర్దేశించిన సదుపాయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మస్టర్ విధానం వల్ల పనిచేసి అలసిపోయిన కూలీలను ఎండలో నాలుగు నుంచి ఐదు కిలో మీటర్ల దూరం నడిపించడం వారికి తీవ్ర ఇబ్బందిగా ఉందని, జిల్లా, మండల కేంద్రాలలోనే నెట్‌వర్క్ సరిగా పనిచేయక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి, ఆన్‌లైన్ మస్టర్ విధానం రద్దు చేయాలని కోరారు. ఉపాధి పనులు 100రోజులు ఉండాలని ప్రకటనలు తప్ప వాస్తవానికి ఎక్కడాఅమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.కవిత

భీమడోలు: బాల్య వివాహ నిరోధక కమిటీలు బాధ్యతతో పని చేయాలని ఐసీడీఎస్ గుండుగొలను సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.కవిత అన్నారు. గుండుగొలను ఉన్నత పాఠశాల, గుండుగొలను శాఖా గ్రంథాలయ ఆవరణాల్లో వేర్వేరుగా గురువారం బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులతో అవగాహన సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలకు క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైద్యాధికారిణి ఆర్.జాహ్నవి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం ద్వారా చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం ద్వారా అనేక శరీరక, మానసిక రుగ్మతలకు గురై తీవ్ర ఆనారోగ్య సమస్యలతో బాధపడతారన్నారు. ప్రాణాప్రాయ పరిస్థితులను ఎదుర్కొంటారన్నారు. బాల్య వివాహాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సూపర్‌వైజర్ ఎం.కవిత మాట్లాడుతూ గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలన్నారు. బాలల హక్కుల జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వారికి వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు ప్రోత్సహించినా, చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కారక్రమంలో రేఖా రామలక్ష్మి, అమరావతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

కౌలు రైతు చెన్నారావు కుటుంబాన్ని ఆదుకోవాలి

టి.నరసాపురం: కౌలు రైతు చెన్నారావు కుటుంబాన్ని ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యసాయానికి చేసిన అప్పులు తీర్చలేక మండలంలోని ముత్యాలంపేటలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు గుర్రం చెన్నారావు కుటుంబాన్ని జలమయ్య పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. చెన్నారావు కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, వ్యవసాయ అప్పులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చెన్నారావు ఇద్దరు పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్పించి ఉన్నత విద్య వరకు చదివించాలని, కుటుంబానికి అవసరమైన పథకాలను అందించాలని కోరారు.

ఏలూరు వైస్ ఎంపీపీ ఎన్నిక నేటికి వాయిదా



ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

దెందులూరు : ఏలూరు వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. గురువారం ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ ఎన్నికకు ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. ఎన్నికల అధికారి డిప్యూటీ కలెక్టర్ దేవకిదేవి, ఏలూరు ఎంపీడీఓ శ్రీలత ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరానికి 11 గంటలకు ముందుగానే వచ్చారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఒక్క ఎంపీటీసీ కూడా హాజరు కాలేదు. గంటసేపు వేచి చూసిన దేవకీదేవి సమావేశానికి కోరం లేనందున వైస్ ఎంపీపీ ఎన్నిక శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేసినట్టు ప్రకటించారు. ఏలూరు మండలంలో 9 మంది ఎంపీటీసీలు ఎంపీపీతో కలిసి ఉన్నారు. ఎంపీటీసీలకు వైస్ ఎంపీపీ ఎన్నిక సంబంధించి మరోసారి నోటీసులు ఇచ్చామని ఎంపీడీఓ శ్రీలత తెలిపారు.

పరిహారం పంపిణీలో పక్షపాత ధోరణి తగదు

కుక్కునూరు: నిర్వాసిత ప్రాంతాల్లో ప్రాంతానికో విధంగా పరిహారం అందిస్తూ ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరించడం సరికాదని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్కే గౌస్ విమర్శించారు. గురువారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కుక్కునూరు మండల కమిటీ సమావేశం పెంకె వీరబాబు అధ్యక్షతన ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. గౌస్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ ముంపుకు గురవుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ పరిహారం కటాఫ్ తేదీని 7 అక్టోబర్ 2022గా, ఏలూరు జిల్లాకు కటాఫ్ తేదీని 2017కు పరిమితం చేయడం అన్యాయమని అన్నారు. అశాస్త్రీయ కాంటూర్ లెక్కలను గోదావరి వరదలు తుడిచేశాయని తెలిపారు. ప్రభుత్వం మండలాన్ని యూనిట్‌గా తీసుకోని పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ ఏప్రిల్ 4న వేలేరుపాడులో, ఏప్రిల్ 6న కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ కార్యదర్శి కంగాల కల్లయ్య, మచ్చ ప్రశాంత్, మచ్చ సుభద్ర, మిరియాల సుజాత, మడకం మంగరాజు, మడివి దేవయ్య, నారేం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	34	బీన్లచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	48
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	76
కాకర కాయలు	30-40	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	30	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24-34	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	34
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	రద్దు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక



మోహనరావు, ఆదినారాయణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం హేలూరులోని ఎస్‌టీయూ భవనంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బి.మనోజ్ కుమార్ వ్యవహరించారు. ఫ్యాప్టో నూతన చైర్మన్‌గా ఏపీటీఎఫ్ 1938 ఏలూరు జిల్లా అధ్యక్షుడు జి.మోహన రావు, సెక్రటరీ జనరల్‌గా డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దుకూరి ఆదినారాయణ ఎన్నికయ్యారు. కమిటీ కో చైర్మన్–1, 3లుగా జి.వెంకటేశ్వరరావు, జి.ప్రకాష్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా ఆర్ రవికుమార్, ఎం శామ్యూల్, బి.రెడ్డిదొర, కార్యదర్శిగా సీహెచ్ శివరామ్, కోశాధికారిగా ఎస్‌డీ జిలానీ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని, ఫ్యాప్టో నాయకులను కలుపుకుని హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని మోహనరావు, ఆదినారాయణలు తెలిపారు. సీపీఎస్ రద్దు కోసం, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం ఆందోళనలు చేస్తామన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, అప్పటి వరకు మధ్యంతర భృతిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కుష్టు బాధితులకు చెప్పులు, పండ్ల పంపిణీ



కుష్టు బాధితులకు చెప్పులు, పండ్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కుష్టు విభాగంలో చికిత్స పొందుతున్న బాధితులకు మాతృదేవో సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవి సుబ్బారావు సీతారాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో గురువారం చెప్పులు, పండ్లు, న్యూట్రిషన్ బిస్కెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి సుబ్బారావు మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడమే తమ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వాసవి రాజ్యలక్ష్మి, వేమా హరినారాయణ, కూచిపూడి సత్యనారాయణ, స్టేట్ కోఆర్డినేటర్ మామిడి రాధిక, ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా, హెచ్‌ఈఓ కె.సత్యానందం, ఓపీ పీటీ పీకే కౌసలా, ఓఆర్‌డబ్ల్యూ బీరపోస రాణి, పీసీఏ మాస బత్తుల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 56 రోజులకు రూ.61959 ఆదాయం లభించిందని కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక పోస్టల్ కాలనీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.పవన్ ఉమార్ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.

ఏపీపీఎస్సీ సెంటర్‌పై అసంతృప్తి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సరీ్వస్ కమిషన్ పరీక్షలకు నగరంలో ఉన్న పరీక్షా కేంద్రాల్లో సిద్దార్థ క్వెస్ట్ పరీక్షా కేంద్రం ఒకటి. అయితే ఈ పరీక్షా కేంద్రంలో సౌకర్యాలు లేకపోవడంతో అభ్యర్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాయడానికి సరైన డెస్క్‌లు లేవని, మంచినీటి సదుపాయం కూడా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష సరిగా రాయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐరన్ చోరీపై విచారణ

దెందులూరు: స్థానిక ప్రభుత్వ హౌసింగ్ గోడౌన్‌లో 16 1/2 టన్నుల ఐరన్ చోరీ పై విచారణకు నూజివీడు డీఎస్పీకు అనుమతి ఇచ్చారు. దెందులూరు ఎస్సై డీఎస్పీ అనుమతి ఇవ్వటంతో ఫిర్యాదుదారుడు హౌసింగ్ గోడౌన్ ఇంచార్జి డివిజనల్ ఇంజనీర్, దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ విచారించారు. డివిజనల్ ఇంజనీర్ వద్ద నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. గోడౌన్‌లో ఉన్న ఐరన్ లో 16 1/2 టన్నుల ఐరన్ చోరీ జరిగిందని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. చోరీ జరిగిన రోజు సీసీ ఫుటేజ్ కాపీని సైతం ఎస్సైకు అందజేశాననీ, డివిజనల్ ఇంజనీర్ వివరించారు. సీసీ టీవీ ఫుటేజీలో ట్రక్కు ఆటో చోరీ చేస్తున్న మనుషులు నమోదు అయిందన్నారు. కాగా దెందులూరు పోలీస్ స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రభుత్వ హౌసింగ్ గోడౌన్‌లో ఐరన్ చోరీ జరగటం సంచలనంగా మారింది. సీసీ కెమెరా ఉన్న చోరీ జరగడంతో దెందులూరు హౌసింగ్ గోడౌన్‌లో ఉన్న ఐరన్‌ను ఏలూరు డీఈ కార్యాలయానికి తరలించారు.